## దరఖాస్తు పత్రాలు తహసీల్దార్ ఆఫీసులో అందజేయండి : అహల్యా

మెహిదీపట్నం, మే 2 : రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని గోల్కొండ మండల తహసీల్దార్ డి. అహల్యా సూచిస్తున్నారు. శుక్రవారం గోల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గోల్కొండ మండల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కింద మొత్తం 3507 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయని అన్నారు. ఇందులో ఎస్సీ కార్పొరేషన్‌లో 317, ఎస్టీ కార్పొరేషన్ 34, బీసీ కార్పొరేషన్ 385, ఈబీసీ కార్పొరేషన్ 35, మైనారిటీ కార్పొరేషన్‌కు 2727, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్‌కు 9 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు దరఖాస్తులను అన్ని పత్రాలు జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచిస్తున్నారు.

## 13న బీసీఏ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 13న నిర్వహించాల్సిన బీసీఏ రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజున పాలీసెట్ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి ఈనెల 29న నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షా కేంద్రం, సమయంలలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు.

## సన్న బియ్యం పంపిణీ

చిక్కడపల్లి మే 2: పేదలకు నాణ్యమైన బియ్యం అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లోని రేషన్ షాపులో స్థానిక నాయకురాలు గుర్రం చంద్రకళ శంకర్, అరవింద్ కుమార్ యాదవ్‌లు ప్రారంభించారు.

# ఏవోపై సస్పెన్షన్ వేటు పడనుందా!

- అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు
- విచారణలో పలువురు అధికారులు



బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయం



ఏఓ బీ.సునీత

చార్మినార్, మే 2 :అవినీతి ఆరోపణలతో బండ్లగూడ ఆర్టీవో ఆఫీస్‌లో పనిచేసిన ఏవో అడ్మిస్ట్రేటివ్ అధికారి బీ. సునీత పై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఆమెపై అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన గత చరిత్రను ఉన్నతాధికారులు గుర్తించారు. ఆమె ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడ అక్రమాలు మామూలే. ఆ విషయాలు ఉన్నతాధికారులకు తెలియనిది కాదని బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది సైతం సునీత వ్యవహారంపై అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన రెండు ఉదంతాలు

గతంలో ఒక వాహనం నంబర్ ఏపీ 12వీ 6331, ఇంకో వాహనం నంబర్ ఎంహెచ్ 03ఎన్9381 వాహనాల టెంపరరీ పర్మిట్ కాంట్రాక్ట్ క్యారేజ్ విషయంలో రవాణాశాఖ నియమ నిబంధనలు పాటించికుండా ఇతర రాష్ట్రాల వాహనాలకు అనుమతులు జారీ చేసి అక్రమాలకు పాల్పడింది. దాంతో ఆమెపై చర్యలు తీసుకోవాలని అప్పటి రవాణశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా తేదీ.18.02.2016 నాడు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీచేశారు. ఆ కేసులో విచారణలో ప్రస్తుతం మలక్‌పేట్ ఆర్టీవో అధికారి కిష్టయ్యను విచారణ అధికారిగా నియమించారు.

వారం రోజుల క్రితం బండ్లగూడ ఆఫీస్‌లో వాహన నంబర్ టీఎస్12టీ 4888, వాహనం ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పర్మిట్ విషయంలో వాహన దారుడి నుంచి రూ. 40 వేలు డిమాండ్ చేసింది. తన సహాయకుని ద్వారా 40వేలు తీసుకుంది. దీంతో సదరు వాహన దారుడు రవాణశాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. స్పందించిన జాయింట్ కమిషనర్ సునీతను రవాణశాఖ ప్రధాన కార్యాలయానికి ఆటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సునీత వ్యవహారంపై దర్యాప్తు చేసి రిపోర్టు ఇవ్వాలని దక్షణ మండల ప్రాంతీయ రవాణ శాఖ కార్యాలయం ఇంచార్జీ ఆర్టీవో కిష్టయ్యను ఆదేశించారు.

గతంలో ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలో దర్యాప్తు అధికారిగా ఉన్న కిష్టయ్యకు ఈ విచారణ బాధ్యతలు అప్పగించారు. ప్రతి కేసు విచారణ అధికారిగా ఉన్నతాధికారులు ఆయననే ఎందుకు నియమిస్తున్నారో తెలియడంలేదని పలువురు ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ ఆర్టీఏ ఆఫీస్‌లో పనిచేసిన సమయంలో సునీతపై అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి అవినీతి అధికారులను సస్పెండ్ చేయడం, లేదా నగర బయటి కార్యాలయాల్లో విధులు కేటాయించాలని సునీత తోటి ఉద్యోగులే పేర్కొంటూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీగా అవినీతి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న అధికారిని సస్పెండ్ చేస్తారా? మరోచోట పోస్టింగ్ ఇస్తారా? అనే విషయంలో ఉద్యోగులు వేచి చూస్తున్నారు.

### మళ్లీ ఇక్కడకే వస్తా..

ప్రధాన కార్యాలయంలో అటాచ్‌గా సునీత పోస్టింగ్ బండ్లగూడలోనే వస్తుందని ధీమాగా ఉన్నట్లు తెలుస్తుంది. బండ్లగూడ కార్యాలయ సిబ్బందితో సునీత మాట్లాడుతూ నేను ఇక్కడికే తిరిగి వస్తాను. అప్పుడు చూపిస్తాను తానేంటో అంటూ తోటి ఉద్యోగులతో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం.

## రామారావుకు శ్రమశక్తి అవార్డు


రామారావుకు అవార్డు అందజేస్తున్న దానకిషోర్ తదితరులు

మెహిదీపట్నం మే 2: కార్మికుల దినోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు పి.రామారావుకు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ గంగాధర్, శ్యామ్ సుందర్ రెడ్డి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును అందజేశారు. రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వంశ్రమశక్తి అవార్డులను ప్రదానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కార్మిక సంక్షేమం, కార్మికుల అభివృద్ధి కోసం పనిచేసినందుకు ఈ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని రామారావు తెలిపారు.

## షాదీముబారక్ చెక్కులు అందజేత



మెహిదీపట్నం మే 2: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడానికి ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. శుక్రవారం షేక్పేట్ మండల పరిధిలో మంజూరైన 90 షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మె ల్యే అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండి నసిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## 4న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

ఖైరతాబాద్, మే 2: రవీంద్రభారతిలో ఈ నెల 4న జరిగే శ్రీ సగర భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేడుక లకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జా జుల శ్రీనివాస్‌గౌడ్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యంసాగర్, రాష్ట్ర ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ చైర్మన్ ఆస్కాని మారూతిసాగర్, ఉపాధ్యక్షులు ఆంజనే యులుసాగర్, కేపీ రాములుసాగర్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లవి సాగర్, సరిత సాగర్, జయమ్మసాగర్, యువ జన సంఘం నాయకులు మార్క సురేశ్‌సాగర్, శేఖర్‌సా గర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యని ర్వహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాసతో కలిసి ఆవిష్కరించారు. ఈ వేడుకులకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

## అందాల పోటీలు వద్దు..నాణ్యమైన విద్య అందించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రస్తుతం రాష్ట్రానికి కావాల్సింది అందాల పోటీలు కాద ని, విద్యార్థులకు నాణ్యమైన విద్య కావాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అందాల పోటీలకు సుమారు రూ.200 కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించడం వల్ల రాష్ట్రానికి వచ్చే ఆదా యం ఏమి ఉండదని అభిప్రాయపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల లో పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ఫె లోషిప్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడాలని, యూనివర్సిటీ విద్యార్థులకు ఫెలోషిప్ లేకపోవడం వల్ల అర్ధాంతరంగా పరిశోధనలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశా రు. పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్ లేకపోవడంతో ఆర్థిక భారమై, మెస్ బిల్లులు కట్టలేక విద్యార్థులు పీహెచ్డీ పట్టాలు తీసుకోలేకపోతున్నారని వాపోయారు.

## సమ్మర్ చిల్డ్రన్స్ థియేటర్ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి,మే2ఃతెలంగాణ భాషా సాంస్కృతిక మరియు కళా కిరణాలు కల్చర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సమ్మ్మ చిల్డ్రన్స్ థియేటర్స్ వర్క్ షాప్ పోస్టర్‌ను తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ రవీంద్రభారతిలోని ఆయన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడుతూ మీ అందరి కోసం , ముఖ్యంగా చిన్నపిల్లల కోసం మంచి కార్యక్రమంతో మీ ముందుకు రావడం రావడం జరిగిందన్నారు.చిన్నపిల్లల కోసం థియేటర్ వర్క్‌షాప్‌ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.నాటకం అనేది సమగ్ర కళ, సంపూర్ణ కళ సమహార కళ మనలోని మూర్తిమత్వాన్ని, మనలోని ఆలోచనలని, మనలోని అంశాలన్నింటినీ వెలికి తీయగలిగే అత్యంత అద్భుతమైన కళారూపకంగా నాటకం ఉందన్నారు.రంగస్థలం పరిశోధకుడిగా పనిచేస్తున్న వ్యక్తి బిర్రు కిరణ్‌కుమార్ ఈ వర్క్‌షాప్‌ని నిర్వహిస్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వర్క్‌షాఫ్‌ను పిల్లలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగపంగ ప్రభాకర్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పెండింగ్ ఫీజులను మంజూరు చేయాలి


మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

హిమాయత్ నగర్, మే2 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్‌లను మంజూరు చేయాలని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బంది లేక విద్యార్థుల విద్యకు ఆటంకం కలుగు తుందని ఆరోపించారు. విద్యారంగాన్ని మరింత మెరుగు పరుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాటలకే పరిమితమైందని విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థల యజ మాన్యాలు బకాయి ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో నిరుపేద విద్యా ర్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడాలని ప్రయత్నిస్తే బలమైన ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసిన ట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (ఎండీహెచ్‌ఎం) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను ఈనెల 14 నుంచి, బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్‌లలో బ్యాక్లాగ్ పరీక్షలను ఈనెల 15 నుంచి, దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ, పీజీడీసీఏ, అడ్వాన్స్డ్ డిప్లమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్షలను ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీ న పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్లో www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్



అంబర్‌పేట, మే 2: అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా టి.కిరణ్‌కుమార్ శుక్రవారంబాధ్యతలు స్వీకరించారు. నాంపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కిరణ్‌కుమార్ బదిలీ పైఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న డి.అశోక్ బదిలీపై సీసీ డీడీకి వెళ్లారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట్ రాములు


వెంకట్ రాములు

మెహదీపట్నం: మే 2: లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట్ రాములు శుక్రవారం పదవీ బాధ్య తలు చేపట్టారు. సందర్భం గా ఆయన మాట్లాడుతూ అధికారులను సిబ్బం దిని సమన్వయపరుస్తూ లంగర్ హౌస్ ప్రాంతంలో శాంతిభ దతల సమస్యలు లేకుండా పని చేస్తానన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ కోసం పని చేస్తాం

చాంద్రాయణగుట్ట, మే 2: ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రౌతు గోపి, బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పె క్టర్ గురునాథ్‌లు అన్నారు. నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో భాగంగా శుక్రవారం చాంద్రాయణ గుట్ట ఇన్‌స్పెక్టర్‌గా రౌతు గోపి, బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గురునాథ్ బాధ్య తలను స్వీకరించారు.

# కులగణన చారిత్రాత్మక నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, మే 2: కులగణన అంశం కేవలం గణాంక సేకరణ కాదని, బీసీల సామాజిక న్యాయానికి బాటలు వేసే అరుదైన సాధనమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణలో కుల గణన భారతదేశ సామాజిక రూపు రేఖలను మార్చే చారిత్రాత్మక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రిజర్వేషన్ల పరిమితిని అధికమించి సామాజిక న్యాయాన్ని సాధించడంలో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కుల గణన సర్వే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కుల గణన భవిష్యత్ తరాలకు సామాజిక సమానత్వం అందించే బంగారు బాటని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ దళ్ నాయకులు పాల్గొన్నారు.

# ముసాఫిర్ పుస్తకావిష్కరణ సభ


ముసాఫిర్ పుస్తకా విష్కరణ చేస్తున్న వక్తలు కొలకలూరి ఇనాక్ తదితరులు

రవీంద్రభారతి, మే 2: విమల సాహితీ సమితి అధ్యక్షులు డా.జెల్ది విద్యాధర్ రచించిన నూతన కవితా సంపుటి ముసాఫిర్ పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. కళారత్న డా.బిక్కి కృష్ణ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వక్తలుగా పద్మశ్రీ, మూర్తిదేవి అవార్డు గ్రహిత శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రసిద్ధ కవయిత్రి విజయలక్ష్మి పండిట్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం,శైలజా మిత్రా, రోహిణి వంజారి తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ముసాఫిర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కవి సమ్మేళనంలో కొండపాక రవీంద్రచారి, డా.కోగంటి ఉషారాణి, కళ్లా తురుమెళ్ల పాల్గొని ఘనంగా కవిసమ్మేళనం నిర్వహించారు.

# చంద్రభాగ పుస్తకావిష్కరణ


చంద్రభాగ పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి,మే2 : సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం రవీంద్రభారతిలోని జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల కథల అనువాద సంకలనం చంద్రభాగ కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి, అనువాద రచయిత, డాక్టర్ రూప్‌కుమార్ డబ్బికార్ అనువదించిన ఈ కథలు భారతీయ కథా సాహిత్యానికి దుర్పణం పడుతుందని, ఇలాంటి గ్రంథాలు ముద్రించి వెలులోకి తెస్తూ విశిష్టమైన సాహిత్య కృషి చేస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, అలాగే గ్రంథ రచయిత డాక్టర్ రూపుకుమార్ డబ్బికార్‌ను మంత్రి జూపల్లి అభినందించారు. అలాగే తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన తెలంగాణ సాహిత్య గ్రంథసూచి పుస్తకాన్ని మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయిత సోమశిల తిరుపాల్, తంగిరాల చక్రవర్తి, అనంతరాజు మోహన్‌కృష్ణ తదితర సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు ఘనంగా వీడ్కోలు


టాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన బాలకృష్ణ గౌడ్‌ను భుజాలపై ఎత్తుకొని వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

మెహిదీపట్నం, మే 2 : ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని సమన్వయ పరుస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు తమ అధికారులకు శుక్రవారం టోలిచౌకి, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సుధాకర్‌ను పూలు చల్లుతూ వీడ్కోలు పలికారు. ఆసిఫ్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బాలకృష్ణగౌడ్ ను భుజాలకు ఎత్తుకొని వీడ్కోలు పలికారు.

# బీసీల పోరాటాల ఫలితమే కుల గణన నిర్ణయం


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

కాచిగూడ, మే 2: బీసీ సంఘాల పోరాటాల ఫలితమే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి జనగణనలో కుల గణన చేయడానికి నిర్ణయం తీసుకుందని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ బీసీ సంఘాలతో అభినందన్ హోటల్ లో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎర్ర సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పోరాటాల ఫలితం.. దానికి తోడు వివిధ బీసీ సంఘాలు కేంద్రంలో కులగణనను చేపట్టాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన ఫలితంగానే కేంద్రం కుల గణన నిర్ణయం తీసుకుందన్నారు. కుల గణన ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, దీంతో బీసీలకు అన్ని రంగాల్లో అవకాశాలు లభిస్తాయి అని అన్నారు. బీసీ సంఘాల సుదీర్ఘ పోరాటాల ద్వారానే కేంద్రంలో జన గణనలో కుల గణన ప్రక్రియ.. రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోలా జనార్ధన్, సుధాకర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, వంశీకృష్ణ, ఉదయ్ నేత, రూప, హరితిలక్ సింగ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 2: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ చారి వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (50) జాకల్..ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుని ఒంటిపై నీలిరంగు చొక్కా, ఆష్ రంగు ట్రాక్ పాయింట్, ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు మృతుని వివరాల కోసం 814 380 7592లో సంప్రదించాలని లక్ష్మణాచారి తెలిపారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు


పటేల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

గోల్నాక, మే 2: స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్ పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని పటేల్ నగర్ బిలాల్ మజీద్ బస్తీలో ఆయన పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలోని డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్ హోళ్లలో పేరుకు పోయిన చెత్త వ్యర్థాలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించా రు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకు లు సమీర్, షానూర్, సమీర్ , ముఖ్రం , నవాజ్, సంతోష్ చారి పాల్గొన్నారు.

## మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్‌గా పేరు మార్పు




మెహిదీపట్నం, మే 2: పోలీస్ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్‌ను మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌గా మార్చారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌స్పెక్టర్ మల్లేష్ పోలీస్‌స్టేషన్ నూతన బోర్డును ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటు చేశారు. నేటి నుంచి హుమాయున్‌నగర్ పోలీసుస్టేషన్ మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌గా ఆచరణలోకి వచ్చింది.

## టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్‌గా అభిలాష్

కార్వాన్, మే2 : టప్పాచబుత్రా నూతన ఇన్‌స్పెక్టర్‌గా బేగరి అభిలాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఏ. రాములు సాధారణ బదిలీల్లో భాగంగా నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు మారారు. ఆయన స్థానంలో టప్పాచబుత్రా డీఐ గా విధులు నిర్వహించిన బేగరి అభిలాష్‌ను ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ నగర పోలీస్ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. నూతన డీఐగా దామెర వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.